సాక్షి
సూర్యాపేట

బుధవారం । 2 । అక్టోబర్ । 2024



ఏటీఎంలే టార్గెట్‌గా..

ఏటీఎంలలో డబ్బులు డ్రా చేసి తిరిగి వారి అకౌంట్‌లో జమయ్యేలా చేస్తూ పట్టుబడిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు.

- 10లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం : 590 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం	: 588.80 అడుగులు
ఇన్‌ఫ్లో	: 50,557 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 50,557 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 29,435 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 10,120 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 8,022 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 2,400
వరద కాల్వకు	: 600

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 645 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం : 643.80 అడుగులు	
ఇన్‌ఫ్లో	: 1,665.01 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 1,665.01 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 314.73 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 314.73 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

నేడు సబ్‌జైలులో న్యాయ విజ్ఞాన సదస్సు

హుజూర్‌నగర్ : జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయ మూర్తి గోవర్ధన్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం హుజూర్‌నగర్ సబ్ జైలులో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్లు స్థానిక సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్ కుమార్, జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్‌లు మంగళవారం విలేకరులకు తెలిపారు. అలాగే కోర్టు ప్రాంగణంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, న్యాయ శాఖ సిబ్బంది పాల్గొనాలని కోరారు.

ఇళ్లను తొలగించొద్దు



పేదలతో మాట్లాడుతున్న నాగార్జున్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట పట్టణంలోని సద్దల చెరువు పక్కన ఉన్న ఇందిరానగర్ లోగల పేదల ఇళ్లను కూల్చివేస్తే చూస్తూ ఊరుకోబోమని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో 30వ వార్డు ఇందిరానగర్‌లో పేదలను కలిసి వారికి సంఘీభావం ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ పేదల ఇళ్ల వద్ద అధికారులు మార్కింగ్ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. బాధితులకు ఎలాంటి ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లను కూల్చి వేస్తామని చెప్పడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. తక్షణమే అధికారులు పెట్టిన మార్కింగ్‌లు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు వీరబోయిన రవి, నర్సయ్య, నాయకులు సాయికుమార్, బొమ్మిడి లక్ష్మీనారాయణ, షేక్ జహంగీ ర్, కోడి ఎల్లయ్య, ఉప్పుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో హోమం



మట్టపల్లిలో హోమం చేస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో యాజ్ఞికులు బొర్రా వెంకటవాసుదేవాచార్యులు పర్యవేక్షణలో రెండవ రోజైన మంగళవారం పవిత్రోత్సవాలు కొనసాగాయి. ఆలయంలో శ్రీ స్వామి వారి అనుజ్ఞా స్వీకారం, విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, వాస్తుపూజ, వాస్తుహోమం, అగ్నిమథనం, సంప్రోక్షణ, సప్తదశ కుంభారాధన, ఆవాహన, అభిమర్దన చేశారు. సాయంత్రం అగ్నిధ్యానం, శయ్యావేది ప్రకల్పనం, పవిత్ర ఆవాహనం, సుదర్శన యంత్ర స్థాపన, బలిహరణ, ప్రత్యేకార్చన, నీరాజన మంత్ర పుష్పాలు పూర్తిచేసి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. బుధవారం పవిత్రారోపణం జరుగుతుందని ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్ తెలిపారు.

ప్రత్యేక అధికారిగా అనితారామచంద్రన్



నల్లగొండ: రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి 10 జిల్లాలకు ఐఏఎస్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలకు ప్రత్యేక అధికారిగా పంచాయతీ రాజ్ కమిషనర్ అనితా రామచంద్రన్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె ప్రభుత్వం నిర్వహించే వివిధ కార్యక్రమాలకు ప్రత్యేక అధికారిగా వ్యవహరించనున్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలి

మునగాల: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యమివ్వాలని మునగాల మండలం మాధవరంవాసి, మేడ్చల్ డీసీపీ నంద్యాల కోటిరెడ్డి సూచించారు. మంగళవారం మాధవరంలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఇంటితో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. గ్రామంలో చెత్తబుట్టలు పంపిణీ చేశారు. స్థానిక యూపీఎస్‌లో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన హెచ్‌ఎం నవీన్‌రెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, ట్రాన్స్‌కో ఏఈ వికాస్, పంచాయతీ కార్యదర్శి అక్షిత, హెచ్‌ఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

● ఇంటిబాట



స్కూళ్లకు దసరా సెలవులు ప్రకటించడంతో సూర్యాపేటలో ఇంటి బాట పట్టిన విద్యార్థి

● పండుగ రద్దీ



పండుగ, సెలవుల నేపథ్యంలో సూర్యాపేట బస్టాండ్‌లో బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు

ధాన్యం కొనుగోలు లక్ష్యం
3.70 లక్షల టన్నులు

వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు సన్నాహాలు

- 206 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు
- రైతులకు ఇబ్బందులు కలగకుండా అధికారుల ప్రణాళిక
- త్వరలో ప్రారంభం కానున్న వరి కోతలు



వరి సాగు:	**4.72** లక్షల ఎకరాలు
దిగుబడి అంచనా :	**10.22** లక్షల మెట్రిక్ టన్నులు
మార్కెట్‌కు వచ్చేది :	**3.70** లక్షల మెట్రిక్ టన్నులు
కొనుగోలు కేంద్రాలు :	**206**
అవసరమైన గన్నీ బ్యాగులు :	**92,55,600**
ప్రస్తుతం ఉన్న గన్నీ బ్యాగులు :	**21,72,766**

భానుపురి (సూర్యాపేట) : వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఈ సీజన్‌కు సంబంధించిన వరి కోతలు మరో 10, 15 రోజుల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతుల నుంచి ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేస్తోంది. దాదాపు 3.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా పౌరసరఫరాల శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు జిల్లావ్యాప్తంగా 206 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. కాగా సన్నరకం ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వనున్న నేపథ్యంలో రెండురకాల కొనుగోలు సెంటర్లను వేర్వేరుగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

అక్టోబర్ నుంచి జనవరి వరకు..

సూర్యాపేట జిల్లావ్యాప్తంగా 4.72 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఇందులో 3.79 లక్షల ఎకరాల్లో సన్నాలు, 93వేల ఎకరాల్లో దొడ్డురకం వరి పంట వేశారు. బోరుబావుల కింద మొదటగా, తర్వాత మూసీ ఆయకట్టు, సాగర్ ఆయకట్టులో విడతల వారీగా సాగు చేశారు. ఈ క్రమంలో బోరుబావుల కింద సాగైన వరి పంట మరో 10, 15 రోజుల నుంచి కోతకు రానుంది. విడతల వారీగా నాట్లు పడినందున జిల్లా యంత్రాంగం కూడా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈనెల నుంచి డిసెంబర్, జనవరి వరకు రైతుల నుంచి ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అక్టోబర్‌లో 74,050 మెట్రిక్ టన్నులు, నవంబర్‌లో 1,11,070 మెట్రిక్ టన్నులు, డిసెంబర్‌లో 1,29,580 మెట్రిక్ టన్నులు, జనవరిలో 55,524 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయనున్నారు.

దిగుబడి అంచనా 10.22 లక్షల టన్నులు

జిల్లాలో సాగైన వరి పంటకు దాదాపు 10.22 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. ఈ యేడు బోనస్ కారణంగా రైతులు సన్నరకాలను అధికంగా సాగు చేయగా దాదాపు 8.18 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం, 2.04 మెట్రిక్ టన్నులు దొడ్డురకం ధాన్యం వస్తుందని భావిస్తున్నారు. ఏటా రైతులు తమ ఇంటి అవసరాల కోసం వానాకాలంలో సన్నరకం వడ్లను వాడుకుంటారు. అలాగే బహిరంగ మార్కెట్‌లో రెండేళ్ల నుంచి సన్నరకం ధాన్యానికి మంచి ధర ఉండడంతో మిల్లులు, బహిరంగ మార్కెట్లకు రైతులు తమ ధాన్యాన్ని తరలిస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ కొనుగోలు సెంటర్లకు 3.70 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం వస్తుందని వ్యవసాయ శాఖ పేర్కొంటుండగా... ఈ మేరకు ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి వీలుగా 206 సెంటర్లను సివిల్ సప్లయ్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. అయితే సన్నరకం వడ్లకు ప్రత్యేకంగా కొనుగోలు సెంటర్లను ఏర్పాటు చేయనుండగా.. ఎక్కడెక్కడ ఏర్పాటు చేస్తారో స్పష్టత లేదు. ధాన్యం కొనుగోలుకు 92,55,600 గన్నీబ్యాగులు అవసరం ఉన్నట్లు అంచనా వేయగా ప్రస్తుతం 21,72,766 అందుబాటులో ఉన్నాయి.

వయోవృద్ధులను గౌరవించాలి

● కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : ప్రతి ఒక్కరూ వయోవృద్ధులను గౌరవంగా చూడాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంలో అదనపు కలెక్టర్ బీఎస్ లతతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రుల పోషణ , సంరక్షణ చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వయోవృద్ధులు ఆరోగ్యం, ఆస్తిని ఎప్పుడూ కాపాడుకోవాలన్నారు. సూర్యాపేట పట్టణంలో వయోవృద్ధుల సంక్షేమ భవనాన్ని డిసెంబర్ వరకు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తామని, వయోవృద్ధులు ఆసుపత్రికి వెళ్లినప్పుడు అక్కడ సంప్రదించాలన్నారు. కొడుకులు పోషించడం లేదని చాలామంది తల్లిదండ్రులు ప్రజావాణికి రావడంతో ఎంతో తాను ఎంతో బాధపడ్డానని చెప్పారు. ప్రతి శుక్రవారం ఆర్డీఓ కార్యాలయంలో వయోవృద్ధులు తమ సమస్యలపై దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనంతరం వయోవృద్ధులకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి నర్సింగరావు, ఆర్డీఓ వేణుమాధవ్, డీఎస్పీ రవికుమార్, వయోవృద్ధుల సంఘం అధ్యక్షుడు రాంబాబు, సెక్రటరీ అమీర్ ఖాన్, ఓల్డ్ ఏజ్ హోమ్ ఇన్‌చార్జి సత్యనారాయణ, విజయమ్మ, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఉత్పత్తులు తయారుచేయాలి

నాణ్యమైన ఉత్పత్తుల తయారీకి సూర్యాపేట జిల్లాను చిరునామాగా మార్చడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని, అందుకు కావాల్సిన వసతులు సమకూర్చేందుకు జిల్లా యంత్రాంగం సహకరిస్తుందని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తెలిపారు. మంగళవారం సూర్యాపేటలో నిర్వహించిన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) మానక్ మహోత్సవానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో బీఐఎస్ డైరెక్టర్ పీవీ శ్రీకాంత్, శాస్త్రవేత్త తస్నీరు రాకేశ్, డీఐసీ జీఎం సీతారాం, పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, బీఐఎస్ ఎస్‌ఓ వనజామూర్తి, ఎస్పీఓ అభిసాయి ఇట్ట తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్,చిత్రంలో అదనపు కలెక్టర్, అధికారులు

గౌరిచెన్ పర్వతాన్ని అధిరోహించిన అన్విత



గౌరిచెన్ పర్వత శిఖరంపై అన్వితారెడ్డి

భువనగిరి : భువనగిరి పట్టణానికి చెందిన పర్వతారోహకురాలు పడమటి అన్వితారెడ్డి పర్వతారోహణలో మరో రికార్డు సాధించారు. భారత్‌కు చెందిన 38 మంది సైన్యంతో కలిసి అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రం తవాంగ్ జిల్లాలోని 6,488 మీటర్ల ఎత్తులో ఉన్న గౌరిచెన్ పర్వతాన్ని అధిరోహించారు. తూర్పు హిమాలయాలలో మంచుతో నిండిన గౌరిచెన్ పర్వతం వెనకాల చైనా దేశం సరిహద్దు ప్రారంభం అవుతుంది. అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోని డిరాంగ్‌ని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మౌంటరింగ్ అండ్ అడ్వెంచర్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో 30 మంది భారత్ సైన్యంతో పాటు భువనగిరిలో ఉన్న ట్రాన్సెండ్ అడ్వెంచర్ రాక్ క్లైంబింగ్ అకాడమికి చెందిన 8 మంది సభ్యులు సెప్టెంబర్ 1న గౌరిచెన్ పర్వతారోహణను ప్రారంభించి 22వ తేదీన పర్వత శిఖరానికి చేరుకున్నారు. మైనస్ 15 డిగ్రీల శీతల వాతావరణంలో పర్వతారోహణ కొనసాగినట్లు అన్వితారెడ్డి చెప్పారు. పర్వతారోహణ ముగించుకుని అన్వితారెడ్డి మంగళవారం భువనగిరికి చేరుకున్నారు. అన్వితారెడ్డి ఇప్పటికే పలు ఎత్తయిన పర్వతాలను అధిరోహించారు. ఎవరెస్టు పర్వతం, కిలిమంజారో, ఎల్‌బ్రోస్, విన్‌సెన్ పర్వతాలను అధిరోహించిన ఆమె.. మరికొన్ని పర్వతాలను అధిరోహించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు.

● బడిలో బతుకమ్మ



నడిగూడెంలో శ్రీ సాయి పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం ముందస్తుగా నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు, ఉపాధ్యాయులు

యువత నచ్చిన రంగంలో ఎదగాలి

● అదనపు కలెక్టర్ బీఎస్ లత



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

సూర్యాపేటటౌన్ : యువత నచ్చిన రంగంలో కష్టపడి ఎదగాలని జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాలు- 2025 లో ఆమె పాల్గొన్నారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్వామి వివేకానందుడితో పాటు భగత్ సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జిల్లా యువజనోత్సవాలలో భాగంగా నిర్వహించిన జానపద నృత్యం, జానపద గేయం పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి జి.రాంచందర్ రావు, జిల్లా సైన్స్ అధికారి దేవరాజ్, ప్రిన్సిపల్ కెప్టెన్ డాక్టర్ వెంకటేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

సూర్యాపేటటౌన్ : తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం పితృ అమావాస్యతో ప్రారంభమయ్యే బతుకమ్మ వేడుకలతో పాటు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతవాతావరణంలో జరుపుకోవాలని కోరారు. తెలంగాణలో బతుకమ్మను అధికారికంగా నిర్వహించుకునేలా చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. ప్రతి బతుకమ్మ పండుగకు కేసీఆర్.. ఆడపడుచులకు పెద్దన్నగా చీరలు కానుకగా పంపిణీ చేసి తన ఆదరాభిమానాలను చాటుకున్నారని పేర్కొన్నారు. ప్రజలందరికీ బతుకమ్మ, దేవీ శరన్నవ రాత్రోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

14 రోజులుగా నిరంతరాయంగా జలాలు

అర్వపల్లి : గోదావరి జలాలు జిల్లాకు 14 రోజులుగా నిరంతరాయంగా వస్తున్నాయి. ప్రస్తుతం జిల్లాకు 1000 క్యూసెక్కుల గోదావరి జలాలు వస్తుండగా వాటిని జిల్లాలోని 69,70,71 డీబీఎంలకు వదులుతున్నారు. రైతులు ఈ నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని అధికారులు కోరుతున్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు




దిర్శించర్లలో ఖాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న మహిళలు

నేరేడుచర్ల : తాగునీటి కోసం మహిళలు రోడ్డెక్కారు. ప్రతి రోజూ తాగునీటిని అందించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నేరేడుచర్ల మండలం దిర్శించర్ల గ్రామంలోని 10వ వార్డు ప్రజలు నేరేడుచర్ల -జాన్‌పహాడ్ రోడ్డుపై ఖాళీ బిందెలతో రాస్తారోకో నిర్వహించారు. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా వార్డు ప్రజలు మాట్లాడుతూ మోటార్ కాలిపోవడంతో చాలా రోజుల నుంచి ట్యాంకుకు నీరు ఎక్కక ఇబ్బందులు పడుతున్నామని, ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. విషయం తెలుసుకున్న గ్రామ కార్యదర్శి రమాదేవి అక్కడికి వచ్చారు. త్వరలో మోటారు రిపేరు చేయించి మంచినీటి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో మహిళలు ఆందోళన విరమించారు.

కొత్త సార్లు వచ్చేస్తున్నారు!

ప్రభుత్వ పాఠశాలల్లో త్వరలో భర్తీ కానున్న టీచర్ పోస్టులు

- 2024 డీఎస్సీ ద్వారా 386 ఖాళీల భర్తీకి కసరత్తు
- 1:3నిష్పత్తిలో నేటి నుంచి మెరిట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన
- 2008 డీఎస్సీ అభ్యర్థులు కొందరు కాంట్రాక్టు పద్ధతిన వచ్చే అవకాశం
- దసరా తర్వాత విధుల్లోకి



సూర్యాపేటటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఏళ్లతరబడి వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత తీరనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జూలై, ఆగస్టు నెలలో నిర్వహించిన డీఎస్సీ ఫలితాలను సోమవారం విడుదల చేసింది. 1:3 నిష్పత్తిలో అభ్యర్థులను సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ఆహ్వానించింది. అలా గే 2008లో జరిగిన డీఎస్సీలో 30 శాతం కోటా అర్హత కలిగిన బీఈడీ అభ్యర్థులను కాంట్రాక్టు పద్ధతిన విధుల్లోకి తీసుకునేందుకు సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ రెండు డీఎస్సీలకు సంబంధించి సర్టి ఫికెట్ల పరిశీలన ప్రస్తుతం కొనసాగుతోంది. ఈ ప్రక్రియ పూర్తయి కొత్త సార్లు వస్తే ప్రభుత్వ విద్యా వ్యవస్థ మెరుగు పడనుందని విద్యావేత్తలు భావిస్తున్నారు.

2024 డీఎస్సీ ద్వారా భర్తీ కానున్న పోస్టులు..

జిల్లాలో మొత్తం 386 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కానున్నాయి. ఇందులో స్కూల్ అసిస్టెంట్(బయోసైన్స్) 15, స్కూల్ అసిస్టెంట్(మ్యాథ్స్) 10, స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్) 1, స్కూల్ అసిస్టెంట్(ఫిజికల్ సైన్స్) 03, స్కూల్ అసిస్టెంట్ (సోషల్ స్టడీస్)26, స్కూల్ అసిస్టెంట్(తెలుగు) 12, స్కూల్ అసిస్టెంట్(హిందీ) 07, స్కూల్ అసిస్టెంట్(ఇంగ్లిష్)12, స్కూల్ అసిస్టెంట్(స్పెషల్ ఎడ్యుకేషన్) 11, లాంగ్వేజ్ పండిట్(హిందీ) 12, లాంగ్వేజ్ పండిట్(తెలుగు)11, పీఈటీ 05, ఎస్‌జీటీ 261 పోస్టులు భర్తీ కానున్నాయి.

విద్యాశాఖ కార్యాలయంలో..

డీఎస్సీ ఫలితాలు విడుదల కావడంతో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు అధికారులు సిద్ధమయ్యారు. ముందుగా మంగళవారం నుంచి మెరిట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన చేయాల్సి ఉండగా రాష్ట్ర విద్యాశాఖ నుంచి మెరిట్ జాబితా రాకపోవడంతో బుధవారం నుంచి మెరిట్ అభ్యర్థుల సర్టిఫికెట్లను కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పరిశీలించనున్నారు. ఈ నెల 5వ తేదీ వరకు ప్రక్రియ కొనసాగనుంది. విద్యాశాఖ విడుదల చేసిన జిల్లా పరిధిలోని 386 పోస్టులకు 1:3 నిష్పత్తి ప్రకారం 1,158 మంది మెరిట్ అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు రానున్నారు. సర్టిఫికెట్‌ల పరిశీలన అనంతరం ఈ నెల 9న నియామక పత్రాలు అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దసరా తర్వాత కొత్త ఉపాధ్యాయులు బడుల్లో చేరే అవకాశం ఉంది. 2008లో జరిగిన డీఎస్సీలో నష్టపోయిన అభ్యర్థులను కాంట్రాక్టు పద్ధతిన విధుల్లోకి తీసుకునేందుకు ప్రభుత్వం ఓకే చెప్పింది. అందులో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 391 మంది అభ్యర్థులు ఉన్నారు. ఇప్పటికే వీరిని దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. వీరిలో నుంచి కొందరు సూర్యాపేట జిల్లాకు రానున్నారు.

సెల్‌కు మెసేజ్ వచ్చిన అభ్యర్థులు హాజరుకావాలి



డీఎస్సీ 2024 ఫలితాల్లో మెరిట్ సాధించిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో డీఈఓ కార్యాలయానికి రావాలి. 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు మెరిట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నాం. స్టేట్ నుంచి మొబైల్ నంబర్‌కు మెసేజ్ వచ్చినఅభ్యర్థులు హాజరు కావాలి. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సర్టిఫికెట్‌ల వెరిఫికేషన్ ఉంటుంది. – అశోక్, డీఈఓ

ఐదు ఉద్యోగాలు సాధించిన వాణి


భీమిడి వాణి

గుండాల: యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలోని అంబాల గ్రామానికి చెందిన భీమిడి వాణి ఏకంగా ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి శెభాష్ అనిపించుకుంది. మూడు నెలల క్రితం ప్రకటించిన గురుకుల ఫలితాల్లో జూనియర్ లెక్చరర్(తెలుగు), ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టీజీటీ)గా, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ) పోస్టులు సాధించింది. ప్రస్తుతం ఆమె కీసర గురుకుల కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తోంది. ఆదివారం వెల్లడైన డీఎస్సీ ఫలితాల్లోనూ వాణి.. స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)గా, లాంగ్వేజ్ పండిట్ (తెలుగు) పోస్టులకూ ఎంపికైంది. ఐదు ఉద్యోగాలు సాధించిన వాణి ఆదర్శంగా నిలిచింది.

మూడు ఉద్యోగాలతో ఆదర్శంగా పారిజాత


గోరంట్ల పారిజాత

రామన్నపేట : లక్ష్య సాధనకు వైవాహిక జీవితం అడ్డుకాదని నిరూపించింది రామన్నపేటకు చెందిన గృహిణి గోరంట్ల పారిజాత. భర్త ప్రోత్సాహంతో డీఎస్సీ–2024లో స్కూల్ అసిస్టెంట్(తెలుగు), లాంగ్వేజ్ పండిట్, ఎస్టీటీ పోస్టులకు అర్హత సాధించింది. సోమవారం విడుదల చేసిన ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్(తెలుగు) విభాగంలో జిల్లా స్థాయిలో 16వ ర్యాంకు, లాంగ్వేజ్ పండిట్‌లో–13వ ర్యాంకు, సెకండరీ గ్రేడ్ టీచర్ విభాగంలో 24వ ర్యాంకు సాధించింది.

ఒకేసారి మూడు ఉద్యోగాలు


బండి యమున

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని ఇంద్రియాల గ్రామంలో రైతు కుటుంబానికి చెందిన బండి యమున ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైంది. సోమవారం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీతోపాటు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగాలు సాధించింది. కాగా తండ్రి మల్లేశకు ముగ్గురు కుమార్తెలు.. యమున పెద్ద కుమార్తె. ఇంటర్ తరువాత డీఈడీ పూర్తి చేసింది. అనంతరం ఓ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తూనే ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ, బీఈడీ, పీజీ పూర్తి చేసింది.

బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో..

నేటి నుంచి బతుకమ్మ వేడుకలు

- మొదటి రోజు ఎంగిలి పువ్వు బతుకమ్మ
- తొమ్మిది రోజులపాటు ఆడపడుచుల ఆటపాటల సందడి

బతుకమ్మ పండుగ అంటే మహిళల పండుగ. ఈ పండుగకు సంబంధించి అనేక కథలు వాడుకలో ఉన్నాయి. అయితే బాగా ప్రాచుర్యంలో ఉన్న కథ మాత్రం ఇదే.. భూస్వాముల అకృత్యాలను భరించలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంటుంది. ఆమెను ఊరి ప్రజలు చిరకాలం 'బతుకమ్మా'అని దీవించారట. అందుకనే ఈ పండుగ మహిళలను కీర్తిస్తూ జరుపుకునే పండుగ అంటున్నారు. తాము ఆపదలకు దూరంగా ఉండాలని, కుటుంబం చల్లగా ఉండాలని బతుకమ్మ పండుగ సందర్భంగా గౌరమ్మను మహిళలు భక్తిశ్రద్ధలతో ప్రార్థిస్తారు.

ధర్మాంగదుడి వృత్తాంతం..

చోళ దేశాన్ని పారిపాలించే ధర్మంగదుడి వందమంది కుమారులు యుద్ధంలో వీర మరణం పొందుతారు. దీంతో రాజు భార్య సత్యవతి సంతాన ప్రాప్తి కోసం లక్ష్మీ దేవిని వేడుకోవడంతో ఓ కూతురు జన్మిస్తుంది. కనీసం ఆ కూతురైనా బతకాలని కోరుకుంటూ.. చల్లంగా 'బతుకమ్మ'అని దేవతలు, మునులు దీవించారని ప్రతీతి. ఆ రోజు నుంచి ఆ యువరాణి దీర్ఘాయుష్మురాలై బతుకాలని కోరుతూ బతుకమ్మను కొలవడం ఆనవాయితీగా వస్తోందని ఓ కథ ప్రచారంలో ఉంది.



పువ్వులనే దైవంగా పూజించే ప్రత్యేక పండుగ బతుకమ్మ. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచి ప్రకృతితో అనుబంధాన్ని తెలియజేస్తుంది బతుకమ్మ పండుగ. పూల అమరిక నుంచి పాటల ఆలాపన వరకు ప్రతిదీ మనోహరంగా బతుకమ్మ పండుగలో ఆవిష్కృతమవుతుంది. బుధవారం నుంచి బతుకమ్మ వేడుకలు ప్రారంభం కానున్నాయి. తొమ్మిది రోజుల ఈ వేడుకల్లో తంగేడు, గునుగు, జిల్లేడు, బంతి, చామంతి ఇలా ఎన్నో కుసుమాలు బతుకమ్మ కోసమే పూశాయా అనిపిస్తుంది. రాష్ట్రంలో శరన్నవరాత్రులకు ఒకరోజు ముందే అంటే భాద్రపద బహుళ అమావాస్య నుంచి అశ్వయుజ శుక్ల అష్టమి వరకూ బతుకమ్మ పండుగ చేస్తారు.

-రామగిరి(నల్లగొండ), యాదగిరిగుట్ట

ఒక్కో పువ్వుకు ఒక్కో విశిష్టత

గునుగు పూలు



బతుకమ్మ పండుగలో గునుగు పూలకు చాలా ప్రాముఖ్యత ఉంది. ఈ పూలు పంట చేల గట్ల వెంబడి లభిస్తాయి. గునుగు శాస్త్రీయ నామం సెలోసియా. ఇది ఎన్నో ఔషధ గుణాలు కలిగి ఉన్న గడ్డిజాతి పుష్పం. దీనిలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ డయాబెటిక్ గుణాలు ఉంటాయి. గాయాలు నయం చేయడానికి, మధుమేహం, చర్మ సమస్యల నివారణకు ప్రసిద్ధి.

గుమ్మడి పువ్వు



బతుకమ్మను పేర్చేందుకు కావాల్సిన పుష్పాల్లో గుమ్మడి పువ్వులకు ప్రత్యేక స్థానం ఉంది. తమకు భోగభాగ్యాలు అందించి, పిల్లాపాపలను చల్లగా చూడాలని వేడుకుంటూ మహిళలు పసుపుతో గౌరీ దేవిని తయారు చేసి ఈ పువ్వులో ప్రతిష్టిస్తారు. తంగేడు పువ్వుల తరువాత గుమ్మడికే ప్రత్యేక గుర్తింపు రావడానికి కాకతీయు కాలం నాటి సామాజిక మత పరిస్థితులే కారణమని చరిత్ర చెబుతోంది. ఇంకా బీరపువ్వు, దోస పువ్వు, గుమ్మడి పువ్వులు, వాము పూలు వంటి కూరగాయ మొక్కల పువ్వులు, అలాగే తామరపువ్వు, గన్నేరు పువ్వు, కట్ల పువ్వుతో సహా స్థానికంగా విరబూసే ఏ పువ్వునైనా బతుకమ్మకు ఉపయోగిస్తారు.

గడ్డిపువ్వు



చిట్టి చామంతి లాగే రోడ్డు పక్కన గడ్డిలో మొలిచే గడ్డిపువ్వు కూడా బతుకమ్మలో భాగమే. ఈ పువ్వులో యాంటీవైరల్, యాంటీ ఆక్సిడెంట్, యాంటీబయాటిక్ గుణాలుంటాయి. గాయాలు మాన్పడానికి, రక్తస్రావం ఆపడానికి, జుట్టుకు పోషణ కోసం గిరిజనులు ఈ గడ్డిపూలనే ఉపయోగిస్తారు.

బంతి, చామంతి పూలు



సాధారణంగా ఇంటి అలంకరణ కోసం తోరణాలుగా, దేవుడికి పూల దండల కోసం బంతి, చామంతి పూలను ఉపయోగిస్తాం. ఈ పూలు బతుకమ్మను పేర్చడంతో ప్రధానంగా ఉపయోగిస్తారు. ఈ పూలు చర్మ సమస్యలను నివారించే గుణాలు కలిగి ఉంటాయి.



తంగేడు పూలు

తంగేడు అనేది తెలంగాణ రాష్ట్ర పుష్పం. ఇది బతుకమ్మను పేర్చడంలో ఉపయోగించే ప్రధానం పుష్పం. దీని శాస్త్రీయ నామం సెన్నా ఆరిక్యులాట. తంగేడు అనేక ఔషధ గుణాలను కలిగిన పుష్పం. నాటు వైద్యంలో మలబద్ధకం, మధుమేహం, ఇతర మూత్రనాళ సమస్యల నివారణ కోసం ఉపయోగిస్తారు.

మల్లె, లిల్లీ పూలు



మల్లెపూలు, లిల్లీపూలను కూడా బతుకమ్మలను పేర్చడంలో ఉపయోగిస్తారు. బతుకమ్మను పేర్చేటప్పుడు ఈ పూలను పై వరుసలో ఉపయోగిస్తారు. వీటిని ఉపయోగించడం వల్ల పరిసరాలు మొత్తం సువాసనలు వెదజల్లుతాయి.

గౌరమ్మగా కూష్మాండం



జైన దేవత అయిన కూష్మాండినిని.. శైవ మతం ప్రాబల్యం పొందిన తరువాత పద్మాక్షి దేవిగా పూజించడం ప్రారంభించారు. కుష్మాండం అనగా గుమ్మడికాయ అని అర్థం. గుమ్మడి ఆకులను సిబ్బిలో పరిచిన తరువాతనే బతుకమ్మను పేరుస్తారు. పసుపుపచ్చగా ఉండే గుమ్మడి పువ్వు లోని అండాశయం, దాని చుట్టూ ఉన్న కేసరములను బతుకమ్మ పైభాగంలో గౌరీదేవిగా ప్రతిష్టిస్తారు.

బతుకమ్మకు వివిధ రకాల నైవేద్యం..

బతుకమ్మను లక్ష్మీదేవి, పార్వతీదేవి అంశగానే కాదు, శ్రీచక్రశోభితగా, ప్రకృతికి ప్రతిరూపంగా, తమ ఇంటి ముత్తయిదువుగా భావిస్తారు. ఈ సంగతులన్నింటినీ పాటలుగా ఆలపిస్తారు. బతుకమ్మకు వివిధ రకాల నైవేద్యాలు సమర్పిస్తారు. అమ్మవారి ఇష్టాలకు తగ్గట్టుగా పులి హోర, పులగం, బెల్లపు అన్నం, పెరుగన్నం, పాయసం, నెయ్యి కలిపిన అన్నం నివేదిస్తారు. బతుకమ్మ పండుగలో లలితాదేవి ఆరాధన దాగి ఉందని ఈ నైవేద్యాల వల్ల అర్థమవుతుంది.

ఒక్కో రోజు ఒక్కో నైవేద్యం

ఎంగిలి పూల బతుకమ్మ : మొదటి రోజు పేర్చే బతుకమ్మను ఎంగిలి పూల బతుకమ్మ అని పిలుస్తారు. ఇది మహాలయ అమావాస్య రోజున ప్రారంభమవుతుంది. దీనిని రాష్ట్రంలో పెత్రామాస (పితృఅమావాస్య) అని అంటారు. ఈ రోజున గౌరమ్మకు నైవేద్యంగా నువ్వులు, బియ్యం పిండి, నూకలు కలిపి పెడతారు.

- **అటుకుల బతుకమ్మ :** రెండో రోజు నిర్వహించే బతుకమ్మను 'అటుకుల బతుకమ్మ' అని పిలుస్తారు. ఈరోజు ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి తిథి ఉంటుంది. అటుకుల బతుకమ్మ రోజు అమ్మవారికి సప్పిడి పప్పు, బెల్లం, అటుకులతో వండిన పదార్థాలను నైవేద్యంగా సమర్పిస్తారు.
- **ముద్దపప్పు బతుకమ్మ :** మూడోరోజు ముద్దపప్పు బతుకమ్మ. ఈ రోజు ముద్దపప్పు, పాలు, బెల్లంతో అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు.
- **నానే బియ్యం బతుకమ్మ :** నాలుగో రోజు నానే బియ్యం బతుకమ్మ పేరుతో పండుగను నిర్వహించుకుంటారు. ఈ రోజు నానేసిన బియ్యం, పాలు, బెల్లం కలిపి చేసిన పదార్థాలను నైవేద్యంగా నివేదిస్తారు.
- **అట్ల బతుకమ్మ :** ఐదో రోజు అట్ల బతుకమ్మ పండుగ చేస్తారు. అట్లు లేదా దోశలు అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు.
- **అలిగిన బతుకమ్మ :** ఆరో రోజు బతుకమ్మ అలిగిందని భక్తులు విశ్వసించి, ఆ రోజు ఎటువంటి నైవేద్యమూ సమర్పించరు.
- **వేపకాయల బతుకమ్మ :** ఏడో రోజు నిర్వహించే ఉత్సవం పేరు వేపకాయల బతుకమ్మ. ఈ రోజు బియ్యం పిండిని బాగా వేయించి వేప పండ్లుగా తయారు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు.
- **వెన్నముద్దల బతుకమ్మ :** ఎనిమిదో రోజు వెన్నెముద్దల బతుకమ్మ . ఆరోజు ప్రత్యేకంగా నువ్వులు, వెన్న లేదా నెయ్యి బెల్లం కలిపి తయారు చేసిన పదార్థాలను నైవేద్యంగా అందిస్తారు.
- **సద్దుల బతుకమ్మ :** చివరి రోజును సద్దుల బతుకమ్మగా పిలుస్తారు. ఆరోజు ఆశ్వయుజ అష్టమి. అదేవిధంగా దుర్గాష్టమి కూడా జరుపుకుంటారు. సద్దుల బతుకమ్మ రోజు నైవేద్యంగా పెరుగన్నం, చింతపండు పులిహోర, కొబ్బరన్నం, నువ్వులన్నం ఇలా ఐదు రకాల వంటకాలను తయారు చేసి అమ్మవారికి సమర్పిస్తారు. ఆడపడుచుల ఆటపాటలతో తొమ్మిది రోజులపాటు బతుకమ్మను పూజించి గంగలో నిమజ్జనం చేస్తారు. అనంతరం పసుపుతో తయారు చేసిన గౌరమ్మను మహిళలు తమ పుస్తెలకు పూసుకుంటారు. ఇలా చేయడం వల్ల తమ మాంగళ్యం పది కాలాలపాటు సురక్షితంగా ఉంటుందని మహిళలు నమ్ముతారు.



ఇంటి ప్రహరీని ఢీకొట్టిన స్కూల్ బస్సు

- విద్యార్థులకు స్వల్ప గాయాలు

మిర్యాలగూడ టౌన్ : స్కూల్ బస్సు అదుపు తప్పి ప్రమాదం నుంచి విద్యార్థులు బయటపడిన సంఘటన మంగళవారం మిర్యాలగూడ మండలంలో చోటుచేసుకుంది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ పి.లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం కిష్టాపురం, హట్యతండాకు చెందిన విద్యార్థులను సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి గ్రామ సమీపంలో గల వీవీఆర్ సిటీ సెంట్రల్ స్కూల్‌కు బస్సు డ్రైవర్ పెండెం సైదులు రోజు మాదిరిగానే పిల్లలను ఎక్కించుకుని వస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం మార్గమధ్యలో అవంతీపురంలో గల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 30 మంది విద్యార్థులు దైవ దర్శనం చేసుకున్నారు. అనంతరం తిరుగు ప్రయాణంలో గుట్ట దిగుతున్న సమయంలో స్కూల్ బస్సు అదుపు తప్పింది. ఘాట్ రోడ్డు కావడంతో వేగంగా దూసుకొచ్చి గుట్ట కింద ఉన్న లింగంపల్లి రవి ఇంటి ప్రహరీని బస్సు ఢీ కొట్టింది. దీంతో ఆ బస్సులో ఉన్న విద్యార్థి చందన కుడి మోకాలుకు, ధీరావత్ దేవాదత్, దేవ అనూష్, ధీరావత్ మహాలక్ష్మి, ధీరావత్ వెన్నెలతోపాటు పలువురు విద్యార్థుల కాళ్లు, చేతులకు స్వల్ప గాయాలయ్యాయి. సమీపంలో గుట్ట కింద కూర్చున్న కొంత మంది బస్సు వద్దకు వచ్చి విద్యార్థులకు కిందకు దించారు. స్వల్ప గాయాలైన విద్యార్థులను మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు అప్పగించారు. మిర్యాలగూడ మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన విద్యార్థిని చందన తండ్రి సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎంవీఐ

విషయం తెలుసుకున్న మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వీరస్వామి సంఘటన స్థలానికి వెళ్లి స్కూల్ బస్సును పరిశీలించారు. వీవీఆర్ సిటీ సెంట్రల్ స్కూల్‌కు చెందిన బస్సుకు 2022వ సంవత్సరం నుంచి ఇప్పటి వరకు ఫిట్‌నెస్ చేయించలేదని, అనుమతి పత్రాలు కూడా లేవని ఆయన తెలిపారు. స్కూల్ బస్సుకు ఫిట్‌నెస్ లేకపోవడం, డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని, ఈ బస్సును సీజ్ చేసినట్లు ఆయన వెల్లడించారు.

ఏటీఎంలే టార్గెట్‌గా దొంగతనాలు

- నిందితుల వద్ద పలు బ్యాంకుల ఏటీఎం కార్డులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట డీఎస్పీ రవి


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవి

సూర్యాపేట టౌన్ : పలు బ్యాంకులకు చెందిన ఏటీఎంలలో డబ్బులు డ్రా చేసినట్టే చేసి.. తిరిగి వారి అకౌంట్‌లోనే డబ్బులు పడేటట్లు చేస్తూ పట్టుబడిన ఇద్దరు నిందితులను మంగళవారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ రవి వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన గౌరవకుమార్, ఉదయ్‌భాను, విమల్‌లు ఏటీఎంలే టార్గెట్ చేసుకుంటూ దొంగతనాలకు పాల్పడుతున్నారు. నిందితులు వారి సొంత ఏటీఎం కార్డులను ఉపయోగించి డబ్బులు డ్రా చేసేందుకు ఏటీఎంలలోకి వెళ్లి పిన్ ఎంటర్ చేస్తారు. ఏటీఎం మిషన్ నుంచి డబ్బులు బయటకు వచ్చే సమయంలో ఏటీఎం మెషిన్ లాన్ కేబుల్‌ను తొలగిస్తారు. ఆ సమయంలో వీరు ఎంటర్ చేసిన నగదు ఏటీఎం మిషన్‌లో నుంచి బయటకు వస్తుంది. కానీ ఏటీఎం మెషిన్ లాన్ కేబుల్‌ను తొలగించడంతో నెట్‌వర్క్ సమస్య కారణంగా వీరు ఎంతయితే నగదు డ్రా చేస్తారో.. ఆ నగదు తిరిగి వారి ఖాతాలోనే జమ అవుతుంది. ఇలా రోజూ ప్రతి కార్డుకు రూ.10వేల చొప్పున డ్రా చేసినట్టే చేసి లాన్ కేబుల్‌ను తొలగిస్తూ ఏటీఎంల నుంచి వచ్చిన డబ్బులతో ఉడాయిస్తున్నారు. సెప్టెంబర్ 27న పోచంపల్లి బ్యాంకు, 28న డీబీఎస్ బ్యాంక్‌లో దొంగతనం చేసేందుకు ప్రయత్నిస్తుండగా సమాచారం మేరకు పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. మరో నిందితుడు విమల్ పరారీలో ఉన్నట్టు చెప్పారు. నిందితుల వద్ద నుంచి రూ.20వేల నగదు, ఏటీఎం కార్డులు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించిన సూర్యాపేట పట్టణ సీఐ రాజశేఖర్, ఎస్ఐ కుశలవ, హెడ్‌కానిస్టేబుళ్లు కృష్ణ, కరుణాకర్, సైదులును డీఎస్పీ రవి అభినందించారు.

20 గొర్రెల అపహరణ

ఆలేరురూరల్ : గుర్తు తెలియని దుండగులు 20 గొర్రెలను అపహరించిన సంఘటన ఆలేరు మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు మున్సిపాలిటీ 6వ వార్డు బహదూర్‌పేటకు చెందిన కూళ్ల చంద్రయ్య, సాయి ఊరి శివారులో ఉన్న తమ దొడ్డిలోకి సోమవారం సాయంత్రం గొర్రెలను తోలి ఇంటికి వెళ్లారు. మంగళవారం తెల్లవారుజామున చూసేసరికి 20 గొర్రెలు కనిపించకుండా పోయాయి. చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రజినీకర్ తెలిపారు.

వేధింపులు తాళలేకనే హత్య

- గత నెల 27న జగదీష్‌ను హత్య చేసిన భార్య తరఫు బంధువులు
- ఘటనకు సంబంధించి ఐదుగురి అరెస్టు
- వివరాలను వెల్లడించిన దేవరకొండ డీఎస్పీ గిరిబాబు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గిరిబాబు

డిండి: భార్యకు దూరంగా ఉంటూ ఓ బాలికను వివాహం చేసుకుని పెడుతున్న వేధింపులు తాళలేక భార్య తరఫు కుటుంబ సభ్యులు దారుణంగా హత్య చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను మంగళవారం డిండి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో దేవరకొండ డీఎస్పీ గిరిబాబు వెల్లడించారు. డిండి మండల పరిధిలోని కామేపల్లి గ్రామానికి చెందిన రమాదేవికి కేతేపల్లి మండలం కొప్పోలు గ్రామానికి చెందిన శ్రీపతి జగదీష్(35)తో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులున్నారు.

బాలికను వివాహం చేసుకోవడంతో జైలుకు..

హైదరాబాద్‌లో మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్న జగదీష్.. కుటుంబ కలహాల కారణంగా భార్య రమాదేవితో కొన్నేళ్ల నుంచి వేరుగా నివాసం ఉంటున్నాడు. ఇది ఇలా ఉండగా.. కామేపల్లిలో నివాసం ఉంటున్న భార్య రమాదేవి అక్క నిర్మల కూతురితో జగదీష్ పరిచయం ఏర్పచుకుని మాయమాటలు చెప్పి 6 నెలల క్రితం వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో ఆ బాలికను వేధిస్తూ ఇరువురు దిగిన అసభ్యకరమైన ఫొటోలు రమాదేవి కుటుంబ సభ్యులకు వాట్సాప్ ద్వారా షేర్ చేసేవాడు. దీంతో మైనర్‌ను వివాహం చేసుకున్నాడని బాలిక తల్లిదండ్రులు అల్వాల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు జగదీష్‌ను అరెస్ట్ చేసి కోర్టుకు పంపారు. జగదీష్ కొన్నాళ్లు జైలుకు కూడా వెళ్లి వచ్చాడు.

ఎలాగైనా అంతమొందించాలని..

భార్య రమాదేవికి దూరంగా ఉండడం, వరుసకు కూతురైన బాలికను వివాహం చేసుకుని పెడుతున్న ఇబ్బందులను భరించలేక జగదీష్‌ను ఎలాగైనా అంతమొందించాలని అతడి భార్య తరఫు కుటుంబ సభ్యులు నిర్ణయించుకున్నారు. ఈ నెల 27వ తేదీన ఉదయం హైదరాబాద్‌లోని అల్వాల్‌లో నివాసం ఉంటున్న జగదీష్ ఇంటికి వెళ్లి భార్య రమాదేవి ఇంటి యజమాని సహాయంతో జగదీష్‌ను పిలిపించింది. డోర్ తీసిన వెంటనే రమాదేవితోపాటు బాలిక తల్లిదండ్రులు కొంకి పెద్దయ్య, నిర్మల, సోదరులు మధు, అరవింద్ ఒక్కసారిగా జగదీష్‌పై దాడి చేసి తాడుతో కాళ్లు, చేతులు, నోటిని చున్నీతో కట్టేసి అద్దె కారులో పడేశారు. హైదరాబాద్ నుంచి బయలుదేరి దేవరకొండ మీదుగా డిండి మండల పరిధిలోని చెర్కుపల్లి స్టేజీ సమీపంలోని గుట్టలకు తీసుకొచ్చారు. రమాదేవి, నిర్మల కాపల కాస్తుండగా పెద్దయ్య, అరవింద్, మధు.. జగదీష్‌ను తలపై బండరాయితో మోది దారుణంగా హత్య చేశారు.

సీసీ కెమెరాల ఆధారంగా..

ఈ నెల 28వ తేదీన డిండి మండలంలోని పెద్దతండాకు చెందిన ఓ రైతు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పదంగా హత్యకు గురయ్యాడని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. చెర్కుపల్లి గేటు సమీపంలో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా మొదటగా జగదీష్‌ను గుర్తించి అతడి కుటుంబ సభ్యుల ఆధారంగా పలు విషయాలు తెలుసుకున్న పోలీసులు.. కామేపల్లిలో ఉంటున్న పెద్దయ్యను స్టేషన్‌కు తీసుకొచ్చి విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా తనతోపాటు భార్య నిర్మల, కుమారులు అరవింద్, మధు, మృతుడి భార్య రమాదేవి కలిసి హత్య చేసినట్లు పెద్దయ్య ఒప్పుకున్నాడు. ఈ ఘటనలో నిందితులైన ఐదుగురిని అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. హత్య కేసును రెండు రోజుల్లోనే ఛేదించిన డిండి రూరల్ సీఐ ఎస్.సురేష్, ఎస్ఐలు రాజు, సతీష్, సిబ్బంది ఉస్సేన్, నాగరాజు, సైదమ్మ, తిర్పతయ్య, గణేశ్‌లను ఎస్పీ శరత్ చంద్ర పవార్, దేవరకొండ డీఎస్పీ గిరిబాబు అభినందించారు.

యువకుల మృతితో మూడు గ్రామాల్లో విషాదఛాయలు


వంశీ అంత్యక్రియలకు భారీగా హాజరైన గ్రామస్తులు

వేములపల్లి(మాడ్గులపల్లి): సూర్యాపేట జిల్లా చిలుకూరులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మాడ్గులపల్లి, వేములపల్లి మండలాలకు చెందిన యువకులు మృతి చెందడంతో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాలు.. మాడ్గులపల్లి మండలం ఆగామోత్కూర్ గ్రామానికి చెందిన అవిరెండ్ల శ్రీకాంత్(21), త్రిపురారం మండలం గుంటిపల్లి అన్నారంకు చెందిన మల్లికంటి దినేష్ స్నేహితులు. దినేష్ కారు కొందామని శ్రీకాంత్‌కు చెప్పడంతో వారి స్నేహితుడు వేములపల్లి మండలం మొల్కపట్నం గ్రామానికి చెందిన వల్లపుదాసు వంశీ(22)కి కారు డ్రైవింగ్ తెలియడంతో ముగ్గురు కలిసి సోమవారం ఒకే బైక్‌పై కోదాడకు వెళ్లారు. రాత్రి స్వగ్రామాలకు తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో తీవ్ర గాయాలపాలై ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. చేతికందిన కొడుకులు మృతి చెందడంతో యువకుల తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. యువకుల మృతితో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.